# వారసులు

ఇసుక తిన్నెలు వేసుకుని చిక్కిపోయిన గోదావరి వేసవిని నిగ్రహిస్తూ చల్లగాలి తన మిగిలిన నీటి కెరటాల మీంచి వదులుతోంది. చుట్టూ ఆవరించిన నిర్జన విశాల ప్రదేశంలోని చెట్లు గాలికి హాయిగా కదలుతూ గోదావరి గట్టుమీద నృత్యం చేస్తున్నాయి. పద్దెనిమిది సంవత్సరాల క్రితం కనిపించిన గోదావరి తిరిగి అదే దారిలో గతి దప్పక విధిచే బంధింపబడినట్లు అదే రూపంతో మళ్ళీ కనిపించింది మురళికి.

ఎవరో గొల్లవాడు గోదావరి ఒడ్డు రావి చెట్టు క్రింద కూర్చుని పిల్లనగ్రోవి వాయిస్తున్నాడు. దూరంగా మొలిచిన గడ్డి మొలకలు మేస్తున్నాయి దూడలు.

ఆ గంభీరమైన ప్రకృతి పరిసరాలు చూడగానే ఆనందంగా తనూ గొంతెత్తి పాడాలనుకున్నాడు మురళి. కాని తన శక్తి తెలుసుకుని మౌనంగా ఆ గొల్లవాడి స్వరం వింటూ నుంచున్నాడు.

పద్దెనిమిది సంవత్సరాల క్రింతం సంగతులు మురళి మనస్సులో కదిలాయి. కోటిపల్లి నదీతీరంలోని పల్లెటూరు. అప్పుడు బాబయ్య అక్కడ ఉద్యోగం చేస్తుండేవారు. మురళి అయిదవ క్లాసు చదువుకుంటున్నాడు. ఎప్పుడైనా ఆ గోదావరి ఒడ్డుకు వస్తే అదేదో మహా ప్రపంచం యింకా అవతలి నది ఒడ్డున ఉన్నట్లు, ఆ అలలు చిమ్మే ఉద్ధృతమైన గోదావరి అగాధంలో ఏవో తెలియని లోకాలు ఉన్నట్లు, తెలియని అమాయిక ఆలోచనలు ఎన్నో కదిలేవి. జీవితంలో యౌవనదశ మధ్య భాగంలో ఉన్న మురళికి ఆనాటి ఆలోచనల వింత అందులోని రహస్యాలు యీ

నాడు సువిదితం. కనిపిస్తున్న మార్పు గుర్తించి ఒక్క నవ్వు నవ్వుకున్నాడు.

బాబయ్య ఆదరణలో ఎదిగిన మురళి చదువు సంధ్యలు బాగానేర్చి. ఉన్న ఆస్తితో మద్రాసులో బట్టల మిల్లు స్థాపించి వర్తకంచేస్తున్నాడు. లాభాలు దోసిళ్ళతో వస్తున్నాయి. ఉన్నత జీవనానికి అలవాటుపడిన మురళికి ఆ పల్లెటూరు అంతా చిత్రంగా, చిన్నగా అవుపించింది.

మద్రాసు నగరంలో గౌరవాలు, హోదాలు నిలబెట్టుకోడానికి ఖరీదైన దుస్తులతో, జాజి బొమ్మల్లా అలంకరించుకున్న ముఖాలతో సంఘంలో మసలడం రివాజు, అవసరం అయిపోయేది ఈ పల్లెటూరిలో అత్యవసరమైన చిన్న ముతకగుడ్డ చుట్టుకొని, హాయిగా, లీలగా, దేహాన్నంతా ప్రకృతికి వదిలేసి, బంధించే సాంఘిక పద్ధతులకు దూరమై కదలుతున్న జనం, నాగరికులు ఉద్ఘాటించే స్వేచ్ఛనంతా పుణికి పుచ్చుకొన్నట్లు కనిపించారు.

బజారు నడివీధిలో కాఫీ హోటలు పెద్దది ఒకటి కనిపించింది. ఫలహారం సేవించాలని లోపల అడుగుపెట్టాడు మురళి.

ఖరీదైన దుస్తుల్లో పెద్దతరహా ఉన్నత వంశీకుడిగా కనిపిస్తున్న మురళిని చూడగానే, కాఫీ హోటలులో గుమిగూడిన పల్లెజనం అంతా అతనివైపు కళ్ళువిప్పి చూశారు నీలూగ్గా. హోటలు యజమాని సరాసరి అక్కడికి వచ్చేశాడు.

"ఏంకావాలి బాబూ ?"

"ఇడ్లీ-సాంబారు" అలవాటైన ప్రొద్దుటి మద్రాసు ఫలహారం కావాలని ఆజ్ఞ ఇచ్చాడు మురళి.

ఎన్నో కళ్ళు మురళీని తేరిపారి చూస్తున్నాయి. ఇదేచోట నారాయణ పద్దెనిమిది సంవత్సరాల క్రితం ఒక హొటలు పెట్టుకొని ఉండేవాడు. అతనేమయ్యాడో ! తడికలతో ఆవరింపబడి మధ్యన కాగితాల బుట్టలు వేలాడుతూ ఉండేది. వంటలక్క పేరమ్మ పెసరెట్లు తయారయ్యే యంటూ అరుస్తూ నారాయణన్ని పిలిచేది.

పేరమ్మ, నారాయణ, గురించి ప్రజలు ఏదో గుసగుస లాడుకున్నా పెసరెట్లు మాత్రం రుచిగానే ఉండేవి బాబయ్యతో ఎన్నోసార్లు అక్కడ పెసరెట్లు తిన్నాడు మురళీ.

"ఇక్కడ నారాయణ అనే అతను ఒక హొటలు పెట్టిఉండే వాడు ! మీకు తెలుసునా ?" మురళి హొటలు యజమానివైపు చూశాడు.

"ఆయన చనిపోయాడండి !" సమాధానం !

"అయితే, మీరు అతని కుమారులా ?"

"కుమారుణ్ణి కాదు కానండి, కుమారుడులాంటి వాణ్ణే అయ్యాను"

ఆ సమాధానం మురళికి అర్థం కాలేదు.

"తమ పేరండి !" ఒక సన్నపాటి రైతులాంటి మనిషి ప్రశ్నించాడు.

మురళి తేరిపారి చూశాడు.

ఎప్పుడో ఎక్కడో చూసిన ముఖంలా ఉంది.

చిన్నప్పుడు ఎరుగున్నా, పద్దెనిమిది సంవత్సరాలలో ప్రతిమనిషిలో అనేకమైన మార్పులు కలుగుతాయి. అయినా ఆ మనిషిని బాగా చూసినట్లు గుర్తుంది.

"నా పేరు మురళీ" చెప్పాడు అతను.

"ఏ వూరు ?"

"మద్రాసు"

"అలాగాండి !"

ఆ సన్నపాటి మనిషి ఒక నిముషం ఊరుకున్నాడు.

నారాయణ దగ్గర చిన్నప్పటి నుంచి హోటలులో పని చేస్తోండే ఆ కుర్రాడు యీయన. పేరమ్మ చచ్చిపోయాక నారాయణకు దేవుడు మీద భక్తిశ్రద్ధలు పెరిగిపోయాయి. బాగా సంపాదించి హోటలుకు యీగచ్చుమేడ కట్టాడు. తన ఆస్తి పంచుకోగలిగిన వారసులున్నా యీయనకే అభిమానంతో ఆస్తి అప్పచెప్పి చచ్చిపోయాడు నారాయణ."

ఆ హోటలు యజమాని, రామేశం, చరిత్ర గురించి ఆ సన్నపాటి మనిషి చెప్పాడు. విన్నాడు మురళీ. వారసులను, బంధువులను విడిచి, తన హోటల్లో పనిచేసే ఎవరో కుర్రాడికి ఆస్తి యిచ్చేసిన నారాయణ వింత ప్రకృతికి ఆశ్చర్య పోయాడు మురళీ. అభిమానం కావచ్చు, సమాధానం చెప్పుకొన్నాడు.

"ఇక్కడ పెసరెట్టు బాగుంటుంది. తినండి" ఆ సన్నపాటి మనిషి ఒక సూచన చేశాడు నవ్వుతూ !

"ఇవ్వండి" అన్నాడు మురళీ.

మరుక్షణంలో ప్లేటుతో తయారయ్యింది పెసరెట్టు ఎదురుగా !

"తమర్ని ఎక్కడో చూసినట్టుందండి బాబుగారూ !" అన్నాడు సన్నపాటి మనిషి.

"నిన్ను బాగా ఎరిగినట్లు గుర్తు కొస్తోంది" అన్నాడు మురళి.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఆ! ఆమధ్య వార్తా పత్రికలో చూశానండి - ఏదో మిల్లు యజమానుల సంఘానికి అధ్యక్షులైనట్లు..." నసిగాడు సన్నపాటిమనిషి.

"అయితే పత్రికల్లో చదివినవన్నీ జ్ఞాపకం పెట్టుకోగలరన్న మాట !"

"ఎంతమాటన్నారు బాబూ !"

"నీ పేరు"

"వీరన్న"

"పద్దెనిమిది సంవత్సరాల క్రితం అప్పారావుగారు అనే ఒకాయన ఈ వూళ్ళో పంచాయతీ ఇనస్పెక్టరుగా ఉండేవారు తెలుసా ?"

"అయ్యో ! ఎంతమాట ! అప్పారావుగారి దగ్గరనే కదండి సేవని చేస్తా !" అన్నాడు వీరన్న ఆత్రుతగా.

"నేను వారి అన్నగారి అబ్బాయిని" మురళి నవ్వాడు.

"ఆఁ అలాగాండి...చిన్నప్పుడు మీరు అదోలా ఉండేవారు... చాలా అమాయకులుగా ...కుర్రాళ్ళచేత దెబ్బలుతింటూ. నేను ఒకసారి అడ్డు వచ్చానండి జ్ఞాపకం ఉందాండి...బాబయ్యగారికి నేనంటే ఎంతో అభిమానం...అమ్మగారు కులసాండి ? బాబయ్యగారు పోయారుగా... వారి కుటుంబం ఎక్కడుందో...ఇప్పుడు ఒకసారి వారినిచూడాలండి!... మిమ్మల్ని చూస్తోంటే ఎంతో ఆనందంగా ఉందండి!...ఇంకో రెండు పెసరట్లు తెప్పించమన్నారా...రామేశంగారూ చూస్తావేమిటియ్యా..."

తేవయ్యా...ఈయన మీ అప్పారావుగారి అన్నగారి అబ్బాయి మురళి గారు...చాలా సంతోషంగా ఉందండి" అంటూ ఏమిటో చెప్పలేని ఆనందముతో దగ్గరగా వచ్చేశాడు వీరన్న.

వీరన్న పంచాయితీ బోర్డులో బంట్రోతు. పద్దెనిమిది సంవత్సరాల క్రితం అతను ఇరవై రెండేండ్ల యువకుడు. ఇప్పుడు నలభై సంవత్సరాలు వచ్చినా ఎలావున్న మనిషి అలానే వున్నాడు. అందుకే మురళి యిట్టే గుర్తుపట్టాడు.

పెద్ద హోదాలో మిల్లు యజమానిగా మద్రాసులో నాగరికతలో నాజూకుగా మనకే అలవాటున్న మురళికి ఒక బంట్రోతు తన దగ్గరగా వచ్చి కౌగలించుకొనేటంత పని చేస్తోంటే ఏంచేయ్యాలో అర్థం కాలేదు. బాగుండదని వీరన్న ప్రవర్తన మురళిని రక్షించలేక పోయాడు.

రామేశం పెద్ద ప్లేటులో మరో రెండు పెసరెట్లు తెచ్చాడు. అప్పారావుగారి బంధువని అప్పుడే వీరన్న ఆ హోటల్లోకివచ్చే వాళ్ళందరికీ మురళికి పరిచయం చేసేశాడు.

వీరన్న మురళి బాబయ్య దగ్గర చాలా నమ్మకంగా పనిచేసేవాడు. వాళ్ల కుటుంబ కష్టసుఖాలలో యించుమించు ఒకడుగా పాలు పంచుకుని విశ్వాసంగా బ్రతికిన నౌకరు. అందువల్ల మురళిని చూడగానే వీరన్న మనస్సు ఆనందంతో నృత్యం చేసింది.

"పిల్లలా ?" అడిగాడు మురళి.

"యిద్దరు పిల్లలు పుట్టిపోయారండి"

"పాపం"

వద్దంటున్నా వీరన్న యింకా దోసె, పూరీ తెమ్మన్నాడు రామేశాన్ని. అన్నీ తిన్నాడు మురళి!

"నువ్వు కూడా తినవోయి!" అన్నాడు మురళి.

"నాకేమీ వద్దండి!"

"అలాకాదు. కాఫీ అయినా త్రాగాలి"

కాఫీ త్రాగాడు వీరన్న.

ఫలహారాలు పూర్తి అయ్యాయి!

మురళివెళ్ళి రామేశానికి డబ్బుయివ్వ బోయేడు.

వీరన్న సంజ్ఞ చేశాడు.

రామేశం డబ్బు తీసుకోలేదు.

"అదేమిటి వీరన్నా? డబ్బు తీసుకోమను" అన్నాడు మురళి.

"మీరు వచ్చేయండి బాబూ! నేచూసుకుంటాను."

"అదేమిటి! నువ్వు డబ్బు చెల్లించడం బాగులేదు!"

పరవాలేదు బాబూ! మీరు బయటికిరండి" తప్పలేదు మురళికి బయట ఒకసిగరెట్టు పెట్టి, ఒక కిళ్లి అందించాడు. వీరన్న బస్సుస్టాండు దాకా సరదాగా కబుర్లుచెబుతూ వచ్చాడు. బస్సు బయల్దేరింది ఇంటికి.

వీరన్న అభిమానం మురళి హృదయాన్ని కదిలించింది. బాబయ్యా చనిపోయేటప్పుడు వీరన్నపేర నాల్గెకరాల భూమి వ్రాసి చనిపోయాడని, అందరూ గింజుకున్నారు యింట్లో. బాబయ్యా అభిమానానికి ఆనందిస్తూ ఆ భూమి అక్కర్లేదంటూ మళ్ళీ అతను మా పిన్నికి వ్రాసి యిచ్చేశాడని విన్నాడు మురళి.

అభిమానంతో ఆదరించి, ఆత్మీయత చూపేవాళ్ళే వారసులు కాని శరీర సంబంధమైన బంధువులు వారసులు కాదనితోచింది మురళికి.

నెలరోజులు బంధువులవద్ద గడపాలని యీ ప్రాంతాలకు వచ్చాక, తన బట్టలమిల్లులో సమ్మె జరుగుతున్నట్లు తంతి వచ్చింది. వేతనాలు పెంచాలని సమ్మె కట్టారు కార్మికులు. వాళ్లు అడిగినట్లు వేతనాలు పెంచితే మిల్లుకు నష్టంరాదు. కాని అలాచేస్తే లాభాలు తగ్గుతాయని, సమ్మె ఎదుర్కోవాలని తన ఆర్థిక సలహాదారులు చెప్పారు మురళికి.

మిల్లు విషయాలు చూచుకోవాలని మద్రాసు వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు మురళి యింతకుముందు.

తన దగ్గర విశ్వాసంతో పనిచేసిన కుర్రాడు రామేశానికి పొలాలు అప్పగించిన నారాయణ ఔదార్యం, ఆప్యాయతతో అంటిపెట్టుకుని సేవ చేసిన వీరన్నని మరచిపోని బాబయ్య విశాల హృదయం మురళిని కదిలించాయి.

బస్సు వేగంగా నడుస్తోంది. నిర్మలమైన ప్రకృతి బస్సు దుమ్ములో కప్పబడి కళ్ళకు కనిపించటంలేదు. దుమ్ము తగ్గినచోట సూర్యకాంతిలో ప్రకృతి దూరంగా మెరుస్తోంది.

ఆ బస్సుద్వారా గమ్యస్థానం చేరగానే, తన ఆర్థిక సలహాదారులకు తంతి యివ్వాలని నిశ్చయించాడు మురళి; కార్మికులు అడిగినట్లు వేతనాలు యిచ్చెయ్యమని"

తన వ్యాపార జీవితానికి అభ్యుదయం కూర్చే విశ్వాసమైన కార్మికులే తనకు కాబోయే నిజమైన వారసులని తట్టింది మురళికి.